# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 11-09-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- న్యూఢిల్లీలోని భారత్ మండపంలో 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశం రేపు ప్రారంభం కానుంది.
- బ్రిక్స్ దేశాలు ప్రపంచ స్థాయి ఆవిష్కరణలు, పరిష్కారాలకు కీలక కేంద్రాలుగా ఎదుగుతున్నాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు.
- ఆసియా కప్ జూనియర్ హాకీలో భారత పురుషుల జట్టు ఫైనల్ కు చేరుకుంది.
- ఛత్తీస్‌గఢ్, ఒడిశా, కోస్తాంధ్రప్రదేశ్ లో ఈరోజు, రేపు భారీ నుండి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (ఐఎండి) తెలిపింది.

======================

న్యూఢిల్లీలోని భారత్ మండపంలో రేపు 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశం ప్రారంభం కానుంది. ఈ మహత్తర కార్యక్రమానికి జాతీయ రాజధాని తుది ఏర్పాట్లు పూర్తి చేస్తోంది. రెండు రోజుల పాటు జరిగే ఈ శిఖరాగ్ర సమావేశంలో బ్రెజిల్, చైనా, ఈజిప్ట్, ఇథియోపియా, ఇండోనేషియా, భారత్, ఇరాన్, రష్యా, సౌదీ అరేబియా, దక్షిణాఫ్రికా, యూఏఈ సహా 11 ప్రధాన వర్ధమాన, అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థలు పాల్గొంటాయి. `స్థితిస్థాపకత, ఆవిష్కరణ, సహకారం, సుస్థిరత కోసం నిర్మాణం` అనే ఇతివృత్తంతో ఈ శిఖరాగ్ర సమావేశానికి భారతదేశం అధ్యక్షత వహించింది. రష్యా అధ్యక్షులు వ్లాదిమిర్ పుతిన్, చైనా అధ్యక్షులు షీ జిన్‌పింగ్, దక్షిణాఫ్రికా అధ్యక్షులు సిరిల్ రామఫోసా, ఈజిప్టు అధ్యక్షులు అబ్దెల్ ఫత్తా ఎల్-సిసి, ఇండోనేషియా అధ్యక్షులు ప్రబోవో సుబియాంటో, ఇరాన్ అధ్యక్షులు మసూద్ పెజెష్కియన్, అబుదాబి యువరాజు షేక్ ఖలీద్ బిన్ మొహమ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్, ఇథియోపియా ప్రధానమంత్రి అబియ్ అహ్మద్ అలీతో సహా ప్రపంచ నాయకులు ఈ శిఖరాగ్ర సమావేశంలో పాల్గొంటారు.

======================

ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో బ్రిక్స్ దేశాల ప్రాధాన్యం క్రమంగా పెరుగుతోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఢిల్లీలో ఈరోజు జరిగిన `బ్రిక్స్ బిజినెస్ ఫోరమ్ నాయకుల సమావేశం`లో ప్రధానమంత్రి ప్రసంగిస్తూ... ప్రస్తుతం బ్రిక్స్ దేశాలు ప్రపంచ జనాభాలో 50 శాతానికి, ప్రపంచ జీడీపీలో 40 శాతానికి, ప్రపంచ వాణిజ్యంలో 25 శాతానికి పైగా వాటాను కలిగి ఉన్నాయన్నారు. గత కొన్నేళ్లలో ప్రపంచ జీడీపీ సుమారు రెండున్నర రెట్లు పెరిగిందని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ప్రపంచంలోని మిగిలిన దేశాలతో పోలిస్తే... బ్రిక్స్ దేశాల ఆర్థిక బలం దాదాపు రెండింతల వేగంతో పురోగతి సాధించిందని తెలిపారు. బ్రిక్స్ దేశాలు, ప్రపంచ స్థాయి ఆవిష్కరణలు, పరిష్కారాలకు కీలక కేంద్రాలుగా ఎదుగుతున్నాయని అన్నారు. అట్టడుగు స్థాయి ప్రజాప్రయోజన కార్యక్రమాల నుంచి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం వరకు.. విస్తృత స్థాయిలో కొత్త ఆవిష్కరణలకు అవకాశాలు తమ దేశాల్లో రూపుదిద్దుకుంటున్నాయని చెప్పారు. సాంకేతిక పరిజ్ఞానం, ఆవిష్కరణలు, కొత్త ఆలోచనలకు బ్రిక్స్ దేశాల్లో పెరుగుతున్న ప్రాధాన్యం.. వాటి భవిష్యత్ సామర్థ్యాన్ని ప్రతిబింబిస్తోందని ప్రధానమంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 24 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = =

భారతదేశ సుదీర్ఘ తీర ప్రాంతం సముద్ర వనరులకు, నీలి ఆర్థిక వ్యవస్థకు గణనీయమైన అవకాశాలను అందిస్తుందని కేంద్ర శాస్త్ర సాంకేతిక శాఖ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ అన్నారు. ఢిల్లీలో `కోస్టల్ ఎకాలజీ, సెక్యూరిటీ అండ్ సస్టెనబిలిటీ-2026`పై ఈరోజు జరిగిన జాతీయ సదస్సులో కేంద్రమంత్రి వర్చువల్‌గా ప్రసంగిస్తూ.. భారత్ స్వదేశీ సామర్థ్యాలను పెంపొందించుకుంటూనే... లోతైన సముద్రంలోని వనరులను అన్వేషించే దిశగా ముందుకు సాగుతోందని అన్నారు. సముద్రపు లోతులను అన్వేషించేందుకు రోబోలు, జలాంతర్గాములను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. ఈ రంగంలో దేశం సాధిస్తున్న పురోగతి, సముద్ర వనరులను అర్థం చేసుకోవడానికి, వినియోగించుకోవడానికి కొత్త అవకాశాలను కల్పిస్తుందన్నారు. తీరప్రాంత, సముద్ర పర్యావరణం కోసం భారతదేశ సంసిద్ధతను బలోపేతం చేయడంలో సముద్ర పరిశీలన, నిఘా, సమాచార ప్రసారం, రిమోట్ సెన్సింగ్, డేటా, అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలు ముఖ్యమైన పాత్ర పోషిస్తాయని మంత్రి స్పష్టం చేశారు. ఈ నెల 12 నుండి 19వ తేదీ వరకు `స్వచ్ఛ సాగర్... సురక్షిత సాగర్` ప్రచారం కొనసాగుతుందని తెలియజేశారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత్ వేదికగా జరగనున్న బ్రిక్స్ సదస్సు కోసం వచ్చే వివిధ దేశాధినేతలతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వరుసగా కీలక ద్వైపాక్షిక సమావేశాలు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా ఈరోజు రష్యా అధ్యక్షులు వ్లాదిమీర్ పుతిన్ తో ప్రధానమంత్రి సమావేశమయ్యారు. ఈ భేటీలో రాజకీయ, ఆర్థిక, రక్షణ, ఇంధన, అంతరిక్ష, నైపుణ్యాభివృద్ధి, ప్రజల మధ్య సంబంధాల రంగాలలో ద్వైపాక్షిక సహకారంలో సాధించిన పురోగతిని సమీక్షించారు. పశ్చిమాసియా, నల్ల సముద్ర ప్రాంతంలోని సంఘర్షణలతో సహా.. పరస్పర ఆసక్తి ఉన్న కీలక ప్రాంతీయ, ప్రపంచ సమస్యలపై కూడా ఇరు దేశాల నాయకులు తమ దృక్పథాలను పంచుకున్నారు. సంఘర్షణలను పరిష్కరించడంలో చర్చలు, దౌత్యమే మార్గమని.. శాంతి ప్రయత్నాలకు సహాయం చేయడానికి భారత్ సిద్ధంగా ఉందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మరోసారి పునరుద్ఘాటించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

అమెరికాలోని 9/11 దాడులు జరిగి 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా మృతులకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈరోజు నివాళులు అర్పించారు. ఉగ్రవాదం వల్ల ప్రపంచ వ్యాప్తంగా లెక్కలేనన్ని మరణాలు చోటు చేసుకున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సీమాంతర ఉగ్రవాదంతో భారత్ దశాబ్దాలుగా పోరాడుతూనే ఉందన్నారు. ఉగ్రవాద ముప్పు అనేక రకాలుగా మారుతోందని, ఆ మహమ్మారిని ఎదుర్కోవడానికి ప్రపంచ వ్యాప్తంగా జరుగుతోన్న అన్ని ప్రయత్నాలకు భారత్ నిరంతరం మద్దతిస్తోందని సామాజిక మాధ్యమ పోస్టులో పేర్కొన్నారు. 2014లో న్యూయార్క్ లోని 9/11 మెమోరియల్ మ్యూజియాన్ని సందర్శించినప్పటి దృశ్యాలను కూడా నరేంద్ర మోదీ పంచుకున్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఛత్తీస్‌గఢ్, కోస్తాంధ్రప్రదేశ్, ఒడిశాలలో ఈరోజు, రేపు భారీ నుండి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (ఐఎండి) ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. అలాగే అరుణాచల్ ప్రదేశ్, అసోం, మేఘాలయ, జార్ఖండ్, కేరళం, మాహే, మధ్యప్రదేశ్, తెలంగాణ, ఉత్తరాఖండ్, విదర్భ, పశ్చిమ బెంగాల్, సిక్కింలలో కూడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. అదేవిధంగా ఒడిశా, తమిళనాడు, పుదుచ్చేరి, కారైకల్ ప్రాంతాలలో ఉరుములతో కూడిన మెరుపులు, ఈదురు గాలులు వీస్తాయని అంచనా వేసింది. రాబోయే రెండు రోజులలో అండమాన్ నికోబార్ దీవులు, బీహార్, తూర్పు రాజస్థాన్, జార్ఖండ్, తెలంగాణ, పశ్చిమ బెంగాల్, సిక్కింలలో కూడా ఇలాంటి వాతావరణ పరిస్థితులే నెలకొనే అవకాశం ఉందని ఐఎండీ వెల్లడించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఆసియా కప్ జూనియర్ హాకీలో భారత పురుషుల జట్టు ఈరోజు జరిగిన మొదటి సెమీ-ఫైనల్‌లో మలేషియాను 3-1 తేడాతో ఓడించింది. దీంతో చైనాలోని మోకిలో జరిగే ఫైనల్‌లో స్థానం సంపాదించింది. భారత కెప్టెన్ అన్మోల్ ఎక్కా రెండు గోల్స్ చేయగా.. సుఖ్వీందర్ ఒక గోల్ చేశారు. ఐదుసార్లు ఛాంపియన్‌గా నిలిచిన భారత్... పూల్ `ఎ`లో తమ చివరి మ్యాచ్‌లో చైనీస్ తైపీని 15-0 తేడాతో ఓడించి... సెమీ-ఫైనల్స్‌లోకి ప్రవేశించింది. ఆదివారం జరిగే ఫైనల్‌లో భారత్, దక్షిణ కొరియాతో తలపడనుంది. అలాగే ఈరోజు జరిగిన మరో సెమీ ఫైనల్ మ్యాచ్ లో దక్షిణ కొరియా పాకిస్థాన్‌ను 4-1 తేడాతో ఓడించి ఫైనల్‌కు చేరుకుంది. కాగా భారత జూనియర్ మహిళల జట్టు రేపు జరిగే సెమీ-ఫైనల్‌లో దక్షిణ కొరియాతో ఆడనుంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 74 వేల 902 పాయింట్ల వద్ద ప్రారంభమై.. చివరికి 121 పాయింట్ల నష్టంతో 74 వేల 781 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 79 పాయింట్లు నష్టపోయి 23 వేల 398 వద్ద స్థిరపడింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ 95 రూపాయల 57 పైసలుగా ఉంది. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 103 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 4 వేల 347 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత శాఖ సహాయ మంత్రి రామ్‌దాస్ అథవాలే ఈరోజు జలంధర్‌లోని డేరా సచ్‌ఖండ్ బల్లన్‌ను సందర్శించి.. సంత్ నిరంజన్ దాస్ జీ మహారాజ్‌ను కలిశారు. ఈ సందర్భంగా కుల వ్యవస్థకు వ్యతిరేకంగా పనిచేసి, సామాజిక ఐక్యత, సమానత్వాన్ని ప్రోత్సహించిన సంత్ రవిదాస్ జీ చేసిన సేవలను కేంద్రమంత్రి గుర్తు చేసుకున్నారు. సమాజంలో సామాజిక సామరస్యం, ఐక్యత కోసం కృషి చేస్తూ.. సంత్ నిరంజన్ దాస్ జీ మహారాజ్ ఈ వారసత్వాన్ని ముందుకు తీసుకువెళ్తున్నారని అన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = = =